క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన



మద్దులబంధలో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాంబాబు

పాడేరు: మండలంలోని డి.గొందూరు పంచాయతీ మద్దులబంధ గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, డి.గొందూరు పంచాయతీ సర్పంచ్ సీదరి రాంబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మద్దులబంధ గ్రామంలో అన్ని వీధులకు సీసీ రోడ్లు అందుబాటులోకి వచ్చినట్టు సర్పంచ్ రాంబాబు చెప్పారు. పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధులతో త్వరలో డ్రైనేజీల నిర్మాణం చేపడుతామన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

చింతూరు: పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్, పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు అన్నారు. చింతూరు, కూనవరం మండలాల్లో సోమవారం పార్టీ బృందం పర్యటించి, వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల ఇబ్బందులను పార్టీ కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు వెంకయ్య, రమణారెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

64 మందికి వైద్య పరీక్షలు



గనెల్ల గ్రామంలో వైద్యశిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలోని కోరాపల్లి సచివాలయం పరిధిలోని గనెల్ల, కోరాపల్లి గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరంలో 64 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 13 మంది జ్వరపీడితులకు ఆర్‌డీటీలు చేయగా ఎవరికీ మలేరియా లేనట్టు నిర్ధారైందని వైద్యులు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, డాక్టర్ రవిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి నడిగట్ల ప్రకాష్, ఏఎన్ఎంలు కృష్ణకుమారి, వరలక్ష్మి,హెల్త్ అసిస్టెంట్, ఆశ వర్కర్లు అన్నపూర్ణ, కనకాలమ్మ గణపతమ్మ గ్రామాల్లో రెండో విడత దోమల నివారణ మందు పనులు చేపట్టారు.

నిత్యావసర సరకుల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

ఎటపాక: మండలంలోని గుండాల గ్రామంలో గోదావరి వరద బాధితులకు సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. గ్రామంలోని 113 కుటుంబాలకు బియ్యం, మంచినూనె, కందిపప్పు అందజేశారు. సర్పంచ్ సీతాలక్ష్మి, ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మాధవరావు,కార్యదర్శి వెంకటేశ్వరావు తదితరులున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ఎస్‌ఐ రవీంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనాలకు యువత అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గిరిజన యువత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్ కిట్లును పంపిణీ చేశారు.ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

బిక్కు బిక్కు మంటూ...

- శిథిలావస్థలో మండల పరిషత్ సిబ్బంది క్వార్టర్లు
- ఇళ్ల పైకప్పులపై టార్పాలిన్లు
- భవనాల్లో విష సర్పాల సంచారం
- పొంచి ఉన్న ప్రమాదంతో ఆందోళన చెందుతున్న ఉద్యోగులు



శిథిలమైన మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది క్వార్టర్లు



పైకప్పుపై కప్పిన టార్పాలిన్లు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది క్వార్టర్స్ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. బీటలు వారిన గోడలు.. తలుపులు...పాడైన కిటికీలు..దెబ్బతిన్న శ్లాబ్‌లు...పైకప్పులు దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు భయం ..భయంగా నివసిస్తున్నారు. 1972 సంవత్సరంలో భవనాలను నిర్మించారు. నేటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. ఇళ్ల పైకప్పు దెబ్బతినడంతో వర్షం పడినపుడు కారిపోతుండడంతో టార్పాలిన్లతో కప్పుకొని నివసించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నివసించేందుకు వీలుగా ఈ భవనాలను సుమారు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. విష సర్పాలు, ప్రమాద కీటకాలు దర్శనమిస్తున్నాయి. ఇళ్లలోకి సర్పాలు వస్తుండడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కాలనీలో సుమారు 70 మంది నివసిస్తున్నారు. దీంతో కొంతమంది వేరే ప్రాంతాల్లో అద్దె ఇళ్లల్లో నివాసముంటున్నారు. భవనాలు శిథిలదశకు చేరుకొని ఏళ్లు గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి కొత్త భవనాలు నిర్మిస్తే అద్దె సమస్య తీరుతుందని, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సర్వేలతోనే సరి..

ఎంపీడీవో సిబ్బంది క్వార్టర్స్ భవనాల పరిస్థితిపై గతంలో 2000, 2010 సంవత్సరాల్లో అధికారులు సర్వే చేశారు. త్వరితగతిన భవనాలను కూల్చివేయాలని సర్వే అధికారులు సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపినా కార్యరూపం దాల్చలేదు. సమస్య పరిష్కారమవుతందని భావించిన కాలనీవాసులకు నిరాశే మిగిలింది. సర్వేతోనే అధికారులు సరిపెట్టారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



ఎంపీడీవో సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కొంతమంది ఇప్పటికే భవనాలు ఖాళీ చేశారు. మరికొంత మంది భవనాలపై టార్పాలిన్లు వేసి నివాసిస్తున్నారు. శిథిల భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. నూతన భవనాలు సమకూరితే సిబ్బందికి వసతి సమస్య తీరుతుంది.

– కె.కిరణ్‌కుమార్. ఎంపీడీవో, ముంచంగిపుట్టు మండలం

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్



ప్రభుత్వ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



నుర్మతి పాఠశాలలో విద్యార్థులకు భోజనం అందజేస్తున్న దాత జోసెఫ్

అరకులోయ టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు తదితరులు విద్యార్థులకు భోజనం, పండ్లను అందజేశారు. అరకులోయలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు బి.లక్ష్మి విద్యార్థులకు అరటిపండ్లు అందజేశారు. ఎంఈఓ మోహన్‌రావు, హెచ్‌ఎం, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో నుర్మతి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పండ్లను ఇండియా ప్రజాబంద్ పార్టీ నాయకుడు కె.జోసెఫ్ అందజేశారు. ఎంఈవో సీహెచ్.బాబూరావుపడాల్ ఆదేశాల మేరకు హెచ్‌ఎం అంబిడి శ్యామసుందరం అమలు చేశారు. విద్యా కమిటీ చైర్మన్ మత్స్యకొండబాబు, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, సన్నాలమ్మతల్లి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



చినగార్లపాడు పాఠశాలలో కూరగాయలు, పండ్లు అందిస్తున్న దాతలు

గంగవరం: లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చినగార్లపాడు పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం, పండ్లు అందజేసిన దాతలకు డీఈవో, ఎంఈవోలు ధన్యవాదాలు తెలిపారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు బేబీరత్నం పాల్గొన్నారు.

ఏనుగురాయిలో జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నరసింగరావు

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీలోని పలు గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలను సోమవారం సర్పంచ్ నరసింగరావు ఆధ్వర్యంలో తొలగించారు. ఏనుగురాయి నుంచి కొత్తూరు, గాదెలబురుగు, నడుమూరు గ్రామాలకు వెళ్లే మార్గంలో పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. ఈ మార్గంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సోమవారం రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించారు. సర్పంచ్ నరసింగరావు చూపిన చొరవపై వాహనచోదకులు , గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వార్డు సభ్యులు రామారావు, హరిబాబు, ధనుర్జయ్, పంచాయితీ కార్యదర్శి సింహాద్రి, సర్వేయర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తాగునీటి సమస్య పరిష్కారం



సుజనకోటలో రిపేర్ చేసిన కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచా యతీ కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కా రం అయింది. 'సాక్షి'లో సోమ వారం 'సుజనకోటలో తాగునీటి సమస్య' అనే వార్తకు అధికారు లు స్పందించారు. పంచాయతీ అధికారులు గ్రామంలో పాడైన తాగునీటి బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించారు.విద్యుత్ సౌకర్యం కల్పించి, నీటి సరఫరా చేశారు. సమస్య ను 'సాక్షి' వెలుగులో తీసుకొచ్చి తాగునీటి సమస్య పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పశు వ్యాధులపై అప్రమత్తం



కిలగాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో సోమవారం పశువైద్యాధికారి సౌజన్యదేవి ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. 77 గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ చేశారు.వ్యాధులతో బాధపడుతున్న పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షకాలంలో పశువులకు ప్రబలే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురిసే సమయంలో పశువులను బయట వదలకుండా చూడాలని, నిర్లక్ష్యం చేస్తే జీవాలు అనారోగ్యానికి గురై చనిపోయే అస్కారం ఉందన్నారు. పశువుల వ్యాధులను వెంటనే గుర్తించడం వల్ల వైద్యం అందించి రక్షించుకోవచ్చన్నారు. ఎటువంటి అనారోగ్యానికి గురైన వెంటనే వైద్యులను సంప్రదించి, సలహాలు తీసుకోవాలని ఆమె కోరారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు రెండు మండలాల్లో 84 పశువుల మృతి



పశు వైద్యాధికారి సౌజన్యదేవి

పెదబయలు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో 38 పశువులు మృత్యువాత పడ్డాయని మండల పశువైద్యాధికారి సౌజన్యదేవి అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో భారీ వర్షాలు, ఈదురుగాలులకు తట్టుకోలేక పశువులు మృతి చెందాయని, అలాగే ముంచంగిపుట్టు మండలంలో 46 మృతి చెందినట్టు ఇప్పటి వరకు సమాచారం అందిందన్నారు. బాధిత పాడిరైతులు తమ బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీతో పాటు చనిపోయిన పశువుల ఫొటోలను ఆయా గ్రామ సచివాలయాల్లో వెటర్నీరీ సహాయకులకు అందజేయాలన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో ఇంకా పశువులు మృతి చెంది ఉంటే వెంటనే సమీపంలోని పశు సంవర్ధకశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఆయా వివరాలను ఐటీడీఏ పీవో, పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.అలాగే పశువుల ఆరోగ్యం క్షీణిస్తే వెంటనే సమాచారం అందించాలని, వర్షాలకు పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రక్షణ గోడలు నిర్మించాలి



కల్వర్టుపై కూలిపోయిన రక్షణ గోడలను చూపిస్తున్న వాణిశ్రీ

మారేడుమిల్లి: మండల కేంద్రం నుంచి కుట్రవాడ, బోదులూరు, ఆకుమామిడికోట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టులకు రక్షణ గోడలు ప్రమాదకరంగా ఉన్నాయని తక్షణమే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మట్ల వాణిశ్రీ సోమవారం కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారేడుమిల్లి మండలానికి పర్యాటకులు తరలివస్తున్నారని, ఈ రహదారి మీదగా గుడిసె హిల్‌టాప్ పర్యాటక ప్రదేశానికి తరలివెళ్తుంటారని, రోజు వందలాది వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. ఈ మార్గంలో కల్వర్టులకు రక్షణ గోడలు కూలిపోవడంతో వాహనదారులు ఆదమరిస్తే పెనూ ప్రమాదాలు జరిగే అస్కారం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రమాదాలు జరిగకముందే కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని అమె కోరారు.

గుంటసీమలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): మండలంలోని గుంటసీమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత క్యాన్సర్ ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ – గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా 164 మందికి వివిధ పరీక్షలు చేశారు. క్యాంప్ కో–ఆర్డినేటర్ కనకేశ్వరరావు మాట్లాడుతూ మంగళవారం డుంబ్రిగుడలో, బుధవారం కించుమండలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారి గౌతమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో రైతులకు ఆదాయం



రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ బోయినకుమారి

గూడెంకొత్తవీధి: ఉద్యాన పంటలతో గిరిజన రైతులకు ఆదాయం మెరుగవుతుందని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సిల్వర్ ఓక్ మొక్కలను ఆమె సోమవారం మండలంలోని వంచుల పంచాయతీ కొడిసింగి గ్రామంలో రైతులకు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు ఏపీఓ రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, వెంకట్, జోగిరాజు, నడిపిపడాల్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మర్రిపుట్టు గ్రామ సమీపంలో కోతకు గురైన కాజ్‌వే కింద భాగం

పెదబయలు: మండలంలోని బంగారుమెట్ట నుంచి మద్దిగురువు వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు గోమంగి.గుల్లేలు పంచాయతీ సరిహద్దులో ఉన్న మర్రిపుట్టు గ్రామ సమీపంలో వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే కాజ్‌వే కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు మళ్లీ కురిస్తే వంతెన కాజ్‌వే కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన వంతెన కింద భాగం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆలయ ధర్మకర్త సింహాచలంనాయుడు

సాక్షి,పాడేరు: పట్టణంలోని రాజరాజేశ్వరి సహిత ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కాశీ అన్నపూర్ణేశ్వరి దేవీకి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, పాడేరు ఆధ్యాత్మిక సేవా సంఘం సభ్యులు వెంకటరత్నం, కొండలరావు, రామారావు, రమేష్‌నాయుడు, చంటి, దిలీప్, ప్రభాకర్, రాజు, యాదగిరి శ్రీను పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



అనంతగిరిలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలో ఎంపీపీ నీలవేణి



బంగారుబుడ్డిలో ఫాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్



రావణాపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో సీతయ్య

అనంతగిరి(అరకులోయ రూరల్): జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య పక్షోత్సవాలు అన్ని ప్రాంతాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్త చెదారాలు, కాలువల్లో పూడికతీత కార్యక్రమాలను చేపట్టారు. మండలంలోని లక్ష్మిపురం, బొరుబోల, అనంతగిరి ప్రాంతాల్లో సోమవారం పారిశుధ్య పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ఎంపీపీ శెట్టి నీలవేణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నగేష్, సర్పంచ్ సోమ్మెలి రూతు, పాల్గొన్నారు.

జి.మాడుగుల: సొలభం పంచాయతీ బంగారుబుడ్డి గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గెమ్మెలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.బాబ్జీ ఆధ్వర్యంలో స్థానికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితులకు రక్త నమూనాలు సేకరించి క్లోరో క్వీన్ మాత్రలను అందజేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శిలు చిన్నంనాయుడు, రవిశాస్త్రి సీడీపీవో జి.సువర్ణమ్మ , ఇంజనీరింగ్ అసిస్టెంట్ దామోదర్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియాంక పాల్గొన్నారు.

కొయ్యూరు: రావణాపల్లి పంచాయతీలో ఎంపీడీవో లాలం సీతయ్య పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. వీఆర్‌వో గంగాధర్,కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు

గూడెంకొత్తవీధి: రింతాడలో పారిశుధ్య పనులను ఎంపీపీ బోయినకుమారితో కలసి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పరిశీలించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ పాపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం: గోదావరి తగ్గుముఖం పట్టడంతో మండల కేంద్రంలో శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టారు. కార్యదర్శి సురేష్, ఈఓఆర్‌డీ రామాంజనేయులు, సర్పంచ్ మల్లం పల్లి హేమంత్ పాల్గొన్నారు.



వై.రామవరంలో పారిశుధ్య పనులు

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.బాపన్నదొర సోమవారం పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని, ముమ్మరంగా పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశించారు.

ప్రయాణికులకు తప్పని అవస్థలు



డ్రైవర్‌తో మాట్లాడుతున్న ప్రయాణికులు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండల కేంద్రంఅనంతగిరి, బొర్రా జంక్షన్, కాశీపట్నం రూట్‌లలో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆయా ప్రాంతాల్లో సోమ వారం బస్సులు నిలపకుండా వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు డ్రైవర్లతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాయా ల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాప్‌ల్లో బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.